ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

ఆదివారం 11 మే 2025



నాటకాల నయా ట్రెండ్

Sunday Special

వీధి నాటకాలకు పెరిగిన ఆదరణ

గ్రామాల్లో పెరుగుతున్న ఆసక్తి

పండుగలు,శుభకార్యాల్లో ప్రదర్శన

ఉత్సాహంగా తిలకిస్తున్న ప్రజలు


ఆదుకోవాలంటున్న నాటక రంగ కళాకారులు



వివరాలు 7వ పేజీలో...

అంతరించిపోతున్న వీధి నాటకాలకు పలువురు కళాకారులు జీవం పోస్తున్నారు. కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు కలిసి వీధి నాటకాలను ప్రదర్శిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. నగర శివారు మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో యువజన సంఘాల సభ్యులు ఇటీవల కాలంలో జరుగుతున్న వివిధ పండుగల్లో ఈ నాటకాల ప్రదర్శనకు ప్రాధాన్యతనిస్తున్నారు.

- మొయినాబాద్ రూరల్, మే10 (ఆంధ్రజ్యోతి)



ఇప్పట్లో లేనట్టేనా?



స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనా..? అంటే అవుననే సమాధానం వస్తుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పంచాయితీ తేలే వరకు ఈ ఎన్నికలు జరిగే సంకేతాలు కనిపించడం లేదు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సి పాలిటీలు, కార్పొరేషన్ల పదవీ కాలం ముగిసినా ఎన్నికల నిర్వహణను ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వస్తుంది. దీంతో పోటీలో నిలబడాలనుకునే ఆశా వహులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఎలక్షన్లు రేపు మాపు అంటుండటంతో ఇప్పటికే చాలా ఖర్చు పెట్టారు. ఇలాగే ఆలస్యమైతే ఈ ఖర్చును మేము భరించలేమని చేతులెత్తేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం !

- జూలై అంటూ ఊరిస్తున్న ప్రభుత్వం
- సందిగ్ధంలో రిజర్వేషన్ల ప్రక్రియ
- ఎలక్షన్ల కోసం ఆశావహుల ఎదురుచూపు
- ఖాళీ అవుతున్న జేబులు!

తాండూరు/ వికారాబాద్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి), మే 10: స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల ఎన్నికలు మరింత ఆలస్య మయ్యేలా ఉన్నాయి. కేంద్రం జనగణనతో కులగణనకు లింకు పెట్టే అవకాశాలు కనిపిస్తుండడంతో ఈ ఎన్నికలు ఇప్పట్లో జరిగే సంకేతాలు కనిపించడం లేదు. బీసీ రిజర్వేషన్లు 42శాతం అమలు చేయాలన్న డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన నిర్వహించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచేందుకు సవరణ కోరుతూ కేంద్రానికి పంపిన విషయం విదితమే. సవరణ కావాలంటే పార్లమెంటులో బిల్లు పాస్ చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఈ ప్రక్రియను ఇంకా మొదలు పెట్టలేదని తెలిసిందే. దీంతో జూలైలో ఎన్నికలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఉట్టిదేనని చెప్పాలి. రంగారెడ్డి జిల్లాలో

మిగతా 7వ పేజీలో...

కొనుగోలు కేంద్రానికి గన్నీ బ్యాగులు

హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

బొంరాస్‌పేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): గన్నీ బ్యాగుల కొరతతో మూడు రోజులుగా 'కొనుగోళ్లలో జాప్యం' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయాన్నే జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రానికి శుక్రవారం రాత్రి ఆరు వేల గన్నీ బస్తాలు సరఫరా చేశామని, అవసరం మేరకు మరిన్ని బస్తాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. లారీలు సరైన సమయానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పేర్కొన్నారు.

కొడంగల్‌లో రోడ్డు విస్తరణకు రూ.45 కోట్లు

కొలతలు తీసుకున్న అధికారులు



కొడంగల్‌లో రోడ్డు విస్తరణకు కొలతలు తీసుకుంటున్న అధికారులు

కొడంగల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ పనులను చేపట్టనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో నాలుగు కిలో మీటర్ల మేర చేపట్టే రోడ్డు విస్తరణ పనులకు రూ.45 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. తాండూర్-మహబూబ్‌నగర్ రోడ్డును 100 ఫీట్ల వెడల్పుతో నాలుగు లేన్లుగా విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, దుకాణదారులు, స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు.

పరిశోధనలకు శ్రీకారం చుట్టాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి



బాలకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న కేపీఆర్ఐటీ చైర్మన్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినూత్న పరిశోధనలకు శ్రీకారం చుట్టాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనాపూర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఆరోహణ్ - 2025 టెక్నికల్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమానికి శనివారం హాజరై మాట్లాడారు. విద్యార్థులు నూతన పరిశోధనలపై అసక్తి చూపాలని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు లేకుంటే ఎన్ని పట్టాలున్నా శూన్యమేనన్నారు. పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన రోబోటిక్స్, పోస్టర్, పేపర్ ప్రజంటేషన్లను తిలకించారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని కేపీఆర్ఐటీ కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, కార్యదర్శి రాకేష్‌రెడ్డి, డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్‌కశ్యప్ తదితరులు పాల్గొన్నారు.




వైభవం.. వేంకటేశ్వరుడి కల్యాణం

ఘట్‌కేసర్, మే 10 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ శ్రీగోదా రంగనాథ స్వామి సహిత శ్రీభూనీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కనులపండువగా జరిగింది. ఆలయ చైర్‌పర్సన్ నర్రి ధనలక్ష్మీశ్రీశైలం, ధర్మకర్తలు, ఈఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, డీసీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహేష్‌గౌడ్, కర్రె రాజేష్, ధర్మకర్తలు నల్లరాళ్ల శ్రీలత, పోలగోని శ్రీకాంత్, పత్తెపు పోశెట్టి, నునావత్ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు మహాప్రభో..

బద్లాపూర్‌తండాలో నీటి కటకట.. వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్న ప్రజలు





బషీరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్లాపూర్ తండా పంచాయతీలో గిరిజనులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా నీటి ట్యాంకుకు సరఫరా చేసే బోరు మోటారు పాడవడంతో నీటి సమస్య తీవ్రమైంది. చేతిపంపులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గం లేని తండావాసులు నీటిని తెచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం కోసం గుంతలు తవ్వగా మిషన్‌భగీరథ పైపులు ధ్వంసమై చుక్క నీరు రావడంలేదని తండావాసులు వాపోతున్నారు. ఉదయం నిద్రలేవగానే తాగునీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

అంతా మా ఇష్టం!

గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల ఇష్టారాజ్యం

- చేయి తడిపితేనే పని
- ప్రతీ పనికి ఓ రేటు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు



మూడుచింతలపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మండలంలోని గ్రామాల్లో పంచాయతీ పాలన గాడి తప్పి అవినీతి రాజ్యమేలుతోంది. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో గ్రామ అభివృద్ధికి పాటుపడాల్సిన పంచాయతీ కార్యదర్శులు స్థానిక నాయకులతో కలిసి అక్రమాల్లో వాటాలు పంచుకుంటున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం పంచాయతీల పాలన కోసం జిల్లా స్థాయి అధికారులను గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించింది. జిల్లా స్థాయి అధికారులు వారి విధి నిర్వహణతోనే సతమతం అవుతుంటే మళ్లీ గ్రామ పంచాయతీలకు

మిగతా 8వ పేజీలో...

ఏ పనికైనా చేయి తడపాల్సిందే!

గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధికి పాటుపడాలి. కానీ, గ్రామాల్లో ఏ పని జరుగుతున్నా వారి నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉదాహరణకు ఉద్దమర్రి, లక్ష్మాపూర్ గ్రామాల్లో గ్రామ కంఠం భూమికి సంబంధించి వివరాలు నమోదు చేయాలంటే రూ. 10 వేలు సమర్పించాల్సిందే. లేదంటే ససేమీరా అంటూ కొర్రీలు పెడుతున్నారు. అక్రమ నిర్మాణాలు, ఇంటి నంబర్లు కేటాయించడానికి భారీగానే వసూలు చేస్తున్నారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఆధార్ కార్డులో వివరాలు మార్చాలంటే రూ. 2,000, డెత్ సర్టిఫికెట్‌కు రూ.5,000 ఇలా ప్రతి పనికోరేటు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



నిలువ నీడ లేక..

ఎండలో నిరీక్షణ

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు

పట్టించుకోని అధికారులు

బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు

7

నిరుపయోగంగా ఏబీసీసీ

రూ.43లక్షలతో నిర్మాణం

8

డయేరియా గుబులు

తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల క్యూ

ఇప్పటివరకు 72 కేసులు నమోదు





తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లు, క్యూలో రోగులు

తాండూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): తాండూరులో ఏప్రిల్ 15వ తేదీ నుంచి ఎండలు మండిపోతున్నాయి. సుమారు 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో అనేక మంది వడదెబ్బకు గురవుతున్నారు. డయేరియా, జ్వరంతో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి క్యూకడుతున్నారు. ఉదయం ఆస్పత్రిలో వైద్యుల వద్ద పరీక్షించుకునేందుకు బారులు తీరుతున్నారు. డయేరియా, జ్వరంతో బాధ పడుతున్నవారితో బెడ్లు ఫుల్ అయ్యాయి. విరేచనాలతో పలు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు అనేక మంది డయేరియాకు గురవుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 72 డయేరియా కేసులు, 64 వైరల్ ఫీవర్ కేసులు నమోదయ్యాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు.

వీర జవాన్లకు ఘన నివాళి

భారత్, పాక్ ఉద్రిక్తతల మధ్య వీరమరణం పొందిన జవాన్లకు వికారాబాద్ పట్టణ ప్రజలు నివాళులు అర్పించారు. శనివారం సాయంత్రం న్యూగంజ్ హనుమాన్ దేవాలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం చేసి కొవ్వొత్తులతో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

- వికారాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి)





ఉపాధిలో పండ్ల తోటలకు ప్రోత్సాహం

బషీరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల కింద విరివిగా పండ్ల తోటలను పెంచాలని సర్కారు నిర్ణయించింది. మామిడి, బత్తాయి, నారింజ, సపోట, జీడి మామిడి, సీతాఫలం, కొబ్బరి, దానిమ్మ, మునగ, చింత, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్ తదితర ఉద్యాన సాగును ప్రోత్సహించనుంది. మండలంలో ఈ సారి 20 ఎకరాల్లో పండ్లతోటలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి హామీ, ఎంపీడీవో కార్యాలయాల్లో రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మంజూరైన రైతులకు మొక్కలకు నిధులతో పాటు, గుంతలు తీయడం, పాదులు నిర్మించడం, మొక్కలు నాటడం వంటి పనులను ఉపాధి కూలీలతో చేయిస్తారు. ఇటు రైతులకు మేలు కలుగుతుంది. అటు కూలీలకు ఉపాధి లభిస్తుంది.

రైతులు నచ్చిన మొక్కలను తెచ్చుకోవచ్చు..

రైతులు పండ్ల తోటల పెంపకానికి తమకు నచ్చిన మొక్కలు నర్సరీల్లో కొనుగోలు చేయొచ్చు. మొక్కలు కొన్న తర్వాత వారి ఖాతాల్లో నగదు జమ చేస్తారు. లేకుంటే ప్రభుత్వ నర్సరీల్లో కూడా పండ్ల మొక్కల ను రైతులు తెచ్చుకోవచ్చు. రైతులకు మొక్కల పెంపకానికి ఒక్కో మొక్కకు నెలకు రూ.12.25 మెయింటెనెన్స్ కోసం ఉపాధి హామీ నిధుల ద్వారా చెల్లిస్తారు. బిందు సేద్యానికి దరఖాస్తు చేసుకుంటే ఉద్యాన శాఖ అధికారులు 90శాతం సబ్సిడీపై పరికరాలు ఇస్తారు. సన్నకారు రైతుగా ఉండి జాబ్‌కార్డు, పట్టాదారుపాసుపుస్తకం ఉండాలి. పొలంలో నీటి వసతి ఉంటే సబ్సిడీపై డ్రిప్ పరికరాలను సైతం ఇస్తారు. వివరాలకు రైతులు ఉద్యాన శాఖ అధికారిని సంప్రదించాలి.



పీడీల సమస్యల పరిష్కారానికి కృషి


వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పీడీలు

చేవెళ్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో విధులు నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు శనివారం సీఎం ప్రధాన ప్రజా వ్యవహారాల సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పీడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత 12 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదని, సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. 254జీవో ప్రకారం న్యాయం చేయాలని కోరారు. దీనికి ఆయన సానూకూలంగా స్పందించి ఆయన సమస్యపై అధికారులకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అంజనేయులు, ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, రాఘవేందర్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ, ఎస్సై, పోలీసు సిబ్బంది

యాలాల, మే 10(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో డీఎస్పీ, ఎస్ఐ గిరి నంబర్ ప్లేట్ లేని వాహనాలను తనిఖీ చేశారు. డీఎస్పీ వాహనదారులకు అవగాహన కల్పించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలతో రోడ్లపై రావొద్దన్నారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే మూడు నెలల జైలుశిక్ష తప్పదని డీఎస్పీ హెచ్చరించారు.

జవాన్లకు అండగా ఉందాం


రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ యువకులు

షాద్‌నగర్ అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా పాకిస్థాన్ దుశ్చర్యలను అడ్డుకుంటూ దేశ రక్షకులుగా నిలిచిన సైనికులకు ప్రతీ ఒక్కరు అండగా నిలవాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అన్నారు. ఆయన జన్మదినాన్ని పురష్కరించుకుని శనివారం స్థానిక రెడ్‌రోజ్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పార్టీ నాయకుడు ఎల్కుర్తి వీరేశం ఆధ్వర్యంలో మలయాలస్వామి ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. బీఆర్ఎస్ నాయకుడు కల్వగురి వెంకటేష్‌గుప్తా ఆధ్వర్యంలో నవోదయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అంజయ్యయాదవ్‌ను సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలంతా ప్రభుత్వ విధానాలకు అండగా నిలవాలని కోరారు. సైనిక కుటుంబాలకు, పోరాటం చేస్తున్న సైనికులకు మేమున్నామన్న మనోధైర్యాన్ని కల్గించేందుకు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వి.నారాయణరెడ్డి,కొందూటి నరేందర్, ఈటె గణేష్, కండెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, వై.మురళీయాదవ్, పి.లక్ష్మీనర్సింహారెడ్డి, దేవేందర్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, ఎంఎస్.నటరాజ్, ఈగ వెంకట్‌రాం రెడ్డి, యుగంధర్, న్యాయవాది రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

చంద్రధన విద్యార్థినికి ఓయూ డాక్టరేట్


రేణుకను సన్మానిస్తున్న బక్కి కుమార్, నాయకులు

తలకొండపల్లి, మే10(ఆంధ్రజ్యోతి): చంద్రధన గ్రామానికి చెందిన ఆవుల రాజయ్య-యాదమ్మ దంపతుల కూతురు రేణుక ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. 'కొండవీటి సత్యవతి రచనలు-పరిశీలన' అంశంపై ప్రొఫెసర్ వారిజా రాణి పర్యవేక్షణలో రేణుక పరిశోధన చేసి థీసిస్ సమర్పించగా ఓయూ అధికారులు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. తాను రాసిన 31 కవితలను 'ఆరని కుంపటి' పేరుతో కవితా సంపుటిని తీసుకువస్తానని రేణుక తెలిపారు. రేణుకను తల్లిదండ్రులు, నాయకులు, గ్రామస్తులు అభినందించారు. అలాగే శనివారం గ్రామంలో రేణుకకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ బక్కికుమార్ ఆధ్వర్యంలో రేణుక, ఆమె తల్లిదండ్రులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజుయాదవ్, యాదయ్య, శేఖర్, శంకర్, రవి, శివకుమార్, విజయ్, నవీన్‌కుమార్, వెంకటేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలతోనే పల్లెలకు రక్ష


మార్కమ్మ, ఎల్లమ్మ విగ్రహాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

యాచారం, మే 10(ఆంధ్రజ్యోతి): గ్రామాలను గ్రామదేవతలే కాపాడుతున్నారని, గ్రామదేవతల పూజలతోనే గ్రామాల్లో శాంతి నెలకొంటోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం మల్కీజ్‌గూడలో మార్కమ్మ, ఎల్లమ్మ దేవతల విగ్రహాల ప్రతిష్ఠోత్సవంలో ఆయన పాల్గొని మ్మవార్లకు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఏటా గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడంతో వర్షాలు కురిసి పాడి పంటలు పండుతున్నాయన్నారు. దేవతలకు పూజలతో సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. ప్రతి వ్యక్తికి యోగాధ్యయనం ఎంతో మంచిదన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటి ఛైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, యాచారం మాజీ వైస్‌ఎంపీపీ గజ్జి రామకృష్ణ, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుడికి ఉత్తమ సేవ అవార్డు


రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తాండూరు ప్రభుత్వ వైద్యుడు జయప్రసాద్

తాండూరు, మే 10(ఆంధ్రజ్యోతి): తాండూరుకు చెందిన ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ జయప్రసాద్‌కు ఉత్తమ సేవ అవార్డు దక్కింది. శుక్రవారం రాత్రి హైదరాబాద్ మణికొండలోని జీఆర్బీ కన్వెన్షన్ హాల్‌లో ఓ టీవీ చానల్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సేవలందించిన వైద్యులకు 'విస్సా హెల్త్' అవార్డులను అందజేశారు. అందులో భాగంగా తాండూరు నుంచి ఐఎంఏ అధ్యక్షుడిగా కొనసాగుతున్న వైద్యుడు జయప్రసాద్ వివిధ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలను అందిస్తున్నందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుల నుంచి అవార్డు అందుకున్నారు. గతంలో జయప్రసాద్‌కు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం అనేక అవార్డులిచ్చాయి.

కాలమిస్టు భాస్కరయోగికి
పాత్రికేయ విశిష్ట పురస్కారం

పరిగి, మే 10(ఆంధ్రజ్యోతి): పరిగికి చెందిన కాలమిస్టు డాక్టర్ పి.భాస్కరయోగికి పాత్రికేయ విశిష్ట పురస్కారం లభించింది. సమాచార భారతి ఆధ్వర్యంలో దేవర్షి నారద జయంతి సందర్భంగా పాత్రికేయులకు పురస్కారాలు అందజేశారు. కాలమిస్ట్‌గా, సామాజిక విశ్లేషకులుగా ఉన్న భాస్కరయోగి పాత్రికేయ విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని వైఎంఐఎస్ వీర్ సావర్కర్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో భాస్కరయోగి రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఉమామహేశ్వర్‌రావు, సాయిప్రసాద్‌ల నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. ముల్లోకాలు తిరుగుతూ వార్తలను, సమాచారాన్ని సేకరించిన లోకకల్యాణం కర్తవ్యాన్ని నిర్వహించిన మొదటి పాత్రికేయుడు నారద మహర్షి, ఆయన పేరిట ప్రపంచ పాత్రికేయ దినోత్సవాన్ని జరుపుకోవడం గొప్ప విషయమని భాస్కరయోగి అన్నారు.



పాత్రికేయ విశిష్ట పురస్కారాన్ని అందుకుంటున్న భాస్కరయోగి















దుమ్మురేగుతున్న మోమిన్‌పేట్-శంకర్‌పల్లి రహదారి

శిథిలమైన రోడ్లు .. వాహనదారుల ఇక్కట్లు

- బీటీ లేచి కంకర తేలిన ప్రధాన దారులు
- రాకపోకలకు ప్రజల నరకయాతన

శంకర్‌పల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని పలు పట్టణ, గ్రామీణ రోడ్లు బీటీ కొట్టుక పోయి, కంకర తేలి అధ్వానంగా మారాయి. వాటిపై ప్రయాణించేందుకు వాహనదారులు జంకుతున్నారు. పాడైన రోడ్లపై తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. శంకర్‌పల్లి-మోమిన్‌పేట్ రోడ్డు పాడైంది. లక్ష్మారెడ్డిగూడ రోడ్డు గుంతలమయమై ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. ఇదే రోడ్డు వెంట హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి మీదుగా మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం, పంచలింగాల, నవాబుపేట్, వికారాబాదు మండలాల గ్రామాలకు రాకపోకలుసాగిస్తున్నారు. ఇంత రద్దీ ఉన్న రోడ్డు మరమ్మతులపై అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుపై రాత్రిపూట ప్రయా ణం మరింత ప్రమాదభరితంగా మారింది.

ఇదే రహదారిగుండా సభాపతి ప్రయాణం

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్, మర్పల్లి, బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో జరిగే అభివృద్ధి పనులకు హాజరై అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తరచూ ఇదే రోడ్డు వెంటే హైదరాబాద్ వెళ్తుంటారు. స్పీకర్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే యాదయ్య సైతం ఇదే రోడ్డుపై తన స్వగ్రామం నవాబుపేట మండలం చించల్‌పేట్‌కు వెళ్తుంటారు. ఆయన ఇదే నియోజకవర్గ ఎమ్మెల్యే. ఆయనైనా పట్టించుకొని రోడ్డు బాగుచేయించాలని ప్రజలు కోరుతున్నారు.





కంకర తేలి గుంతలమయంగా మారిన శంకర్‌పల్లి మండలంలోని రోడ్లు

అధ్వానంగా లింకు రోడ్లు

మంచాల: మంచాల మండలంలోని వివిధ గ్రామాల వేసిన లింకు రోడ్లు అభివృద్ధికి నోచుకోక అధ్వానస్థితికి చేరాయి. కంకరతేలి ప్రమాదకరంగా మారాయి. అస్మత్‌పూర్-మంచాల లింక్‌రోడ్డు, జాపాల-గున్‌గల్, బుగ్గతండా-ఎల్లమ్మతండా లింకురోడ్లను విస్తరించలేదు. అస్మత్‌పూర్-మంచాల రోడ్డును ఒక్క కిలోమీటరు బీటీగా మారిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పుడు రోడ్డు సరిగ్గా లేక జాపాల మీదుగా అదనంగా మూడు కిలోమీటర్లు తిరిగి వెళ్తున్నారు. బుగ్గతండా-ఎల్లమ్మతండా కంకర రోడ్డుతో ప్రజల ఇబ్బందులు చెప్పలేనివి. జాపాల-గున్‌గుల్ లింక్ రోడ్డు 4కిలోమీటర్లు ఉండగా పదేళ్ల క్రితం 2కిలోమీటర్లు వేసిన కంకర తేలి ప్రమాదకరంగా ఉంది. లింక్ రోడ్లకు బీటీ వేయాలని ప్రజలు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



కంకరమయంగా అస్మత్‌పూర్-మంచాల లింక్ రోడ్డు

బ్రిడ్జి పనుల్లో నాణ్యతా లోపం ...

ఆదిభట్ల: ఇబ్రహీంపట్నం మండలం పోచారం-కర్ణంగూడ మధ్య పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జి పనుల్లో నాణ్యత లోపించి సిమెంట్ బెడ్ పగిలిపోయి స్టీలు తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో పోచారం, కర్ణంగూడ, తుర్కగూడ, కప్పాడు, ఎలిమినేడు గ్రామాల వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎలిమినేడు-తిమ్మాపూర్ రోడ్డులో పెద్దవాగుపై మరో బ్రిడ్జి నిర్మించారు. అయితే బ్రిడ్జి పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించలేదు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పట్టించుకోలేదు. దీంతో సీసీ లేచిపోయి స్టీల్‌రాడ్లు పైకి తేలాయి. వాహనదారులు ఇనుపచువ్వలపై నుంచి వెళ్తే టైర్లు బస్ట్ అయ్యే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే బ్రిడ్జి నుంచి తుర్కగూడ వైపు రోడ్డు మధ్యలో రంధ్రం ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు దానిపై నుంచి వెళ్తే పడిపోవడం ఖాయం. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి బ్రిడ్జిపై మరమ్మతులు చేయించాల్సి ఉంది.

రోడ్డు బాగు చేయించాలి



శంకర్‌పల్లి-మోమిన్‌పేట్ ఆర్ అం డ్‌బీ రోడ్డు లక్ష్మారెడ్డిగూడ వద్ద అధ్వానంగా తయారైంది. రోడ్డు గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది ప్రైవేట్ వాహనాలు, బస్సులు ఈ రోడ్డుపై వెళ్తుంటాయి. గుంత లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలి.

- ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, లక్ష్మారెడ్డిగూడ

అధికారులకు ఎన్నోసార్లు విన్నవించాం



మా ఊరి నుంచి రోజూ రెండుమూడు వందల మంది ఈ రోడ్డు నుంచే పనులకు వెళ్తారు. తెల్లవారుజామున రైతులు కూడా కూరగాయలు మార్కెట్‌కు తరలిస్తారు. ఈ రోడ్డు మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. కానీ కంకరతేలి వాహనాల ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డుకు బీటీ వేయాలని గత ప్రభుత్వంలోనే అనేక సార్లు విజ్ఞాపనలు ఇచ్చాం. మంత్రిని, ఎమ్మెల్యేను కలిశాం. ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా డాంబర్ రోడ్డు వేయాలి.

- రవిరాజు, అస్మత్‌పూర్



పోచారం బ్రిడ్జిపై తేలిన ఇనుప చువ్వలు

14, 15 తేదీల్లో వీరభద్రేశ్వరస్వామి జాతర



వీరభద్రేశ్వరస్వామి ఆలయం

తాండూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15 తేదీల్లో మండలంలోని వీరారెడ్డిపల్లి వీరభద్రేశ్వరస్వామి దేవాలయ జాతరను నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు జగదీశ్వరస్వామి శనివారం తెలిపారు. జాతర సందర్భంగా 14న ఆలయంలో అభిషేకం, 15న ఉదయం 4:30గంటలకు రుద్రాభిషేకం, 5గంటలకు పల్లకిసేవ, అనంతరం అగ్నిగుండం, 11:21 గంటలకు ఉమామహేశ్వరుల కల్యాణం, అన్నదానం, సాయంత్రం వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకుపాత్రులు కావాలని ఆయన కోరారు.

మిషన్ భగీరథ పైపులైన్ పగిలి తాగు నీరు వృథా



తాండూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని సెయింట్ మార్క్స్ హైస్కూల్ సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలి వారం రోజులుగా నీరంతా వృథాగ పోతోంది. ఇంతటి కండ కాలంలో తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం, మరమ్మతులు చేయడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రధాన ఆ రోడ్డు వెంట మిషన్ భగీరథ నీరు చెరువును తలపిస్తోంది.

నిలువ నీడ లేక.. ఎండలో నిరీక్షణ



దుద్యాలలో బస్సు కోసం రోడ్డు పక్కన ఎండలో వేచిఉన్న మహిళలు



బస్సు కోసం చెట్టు కింద వేచి ఉన్న మహిళలు

దుద్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత పథకంతో బస్సులకు భారీగా ఆదరణ పెరిగింది. రోజురోజుకూ మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. అయితే బస్సులు నిలిపే చోట ప్రాంగణాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేవు. ఉన్నవి సైతం శిథిలావస్థకు చేరాయి. ప్రయాణికులు మండుటెండల్లో బస్సుల కోసం వేచిచూస్తూ ఇబ్బదులు పడుతున్నారు. నీడ కోసం చెట్లను, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. దుద్యాల స్టేజీ వద్ద, లగచర్ల, ఈర్లపల్లి, హకీంపేట్ గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేవు. ప్రయాణికులు ఎండలో బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. అధికారులు బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మండలంలోని గ్రామాలకు బస్సు సౌకర్యాలు సక్రమంగా లేవు. దుద్యాలతో పాటు గ్రామాలకు ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సులు నడుస్తున్నాయి. ఉద్యోగులు, రోజువారీ కూలీలు, విద్యార్థులు, వివిధ ప్రాంతాలకు పనులు, ఇతర కార్యక్రమాలకు రాకపోకలు సాగించే వారు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. వచ్చే కొన్ని బస్సుల కోసం గంటల తరబడి ఇబ్బందులు పడుతూ నిరీక్షిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మండల కేంద్రానికి, గ్రామాలకు బస్సు సర్వీసులు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గిరిజన రైతు బిడ్డకు ప్రభుత్వ ఉద్యోగం

బొంరాస్‌పేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూర్ పంచాయతీ గంగంబావి తండాకు చెందిన పూల్‌సింగ్, జమ్కిబాయి దంపతుల కుమారుడు మోతీలాల్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి సాధించాడు. 2024-డీఎస్సీలో జిల్లాలో 0.13మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయినా పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాడు. చార్మినార్ జోన్ ఎస్టీ కేటగిరీలో రెండో ర్యాంకు సాధించాడు. ఉద్యోగం సాధించిన మోతీలాల్‌ను తండావాసులు అభినందించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా డీటీడీ వో రామేశ్వరి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. హైదరాబాద్‌లోని జూనియర్ కాలేజీ బాలుర హాస్టల్‌లో బాధ్యతలు చేపట్టనున్నట్లు మోతీలాల్ తెలిపాడు.

నియామక పత్రం అందుకుంటున్న మోతిలాల్ ➤



ఇప్పట్లో లేనట్టేనా?

(5వ పేజీ తరువాయి)

558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో నుంచి 27 పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ప్రస్తుతం 531 పంచాయతీలన్నాయి. వీటిల్లో 4,710 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. జిల్లాలో ఇంతకు ముందు 13 మున్సిపాలిటీలు, 3 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. కొత్తగా ఇటీవల చేవెళ్ల, మొయినాబాద్ మండలాలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయి. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల సంఖ్య 15కు చేరుకుంది. ప్రస్తుతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల సంఖ్య 18కి చేరింది. వీటికీ ఎన్నికలు జరగాల్సి ఉంది. వికారాబాద్ జిల్లాలో కొత్తగా ఆరు ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. ఇంతకు ముందు జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 594 పంచాయతీలు, 5058 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటికి కూడా ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 41ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 28స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాల సంఖ్య 19కి తగ్గింది. జిల్లాలో 62 పంచాయతీలు ఉండగా.. 28 పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ప్రస్తుతం పంచాయతీల సంఖ్య 34కు చేరింది. ప్రస్తుతం తొమ్మిది మున్సిపాలిటీలు, నాలుగు కార్పొరేషన్లు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తు ప్రారంభమైనప్పటికీ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలపై ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో స్థానిక పోరు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

తలలు పట్టుకుంటున్న ఆశావహులు

స్థానిక సంస్థల ఎలక్షన్లు ఎప్పుడొస్తాయా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. గ్రామ, మండల పరిషత్ పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది దాటిపోయింది. మున్సిపాలిటీ పాలక మండళ్లు ముగిసి నాలుగు నెలలు గడుస్తుంది. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తుంది. దీంతో సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్‌గా పోటీ చేసేందుకు ఎదురు చూస్తున్న ఆశావహులకు ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో తల పట్టుకుంటున్నారు. ఓటర్లను, కార్యకర్తలను మచ్చిక చేసుకునేందుకు కొందరు అప్పులు చేస్తుండగా, మరి కొందరు ఆస్తులను అమ్ముకొని ఖర్చు పెడుతున్నారు. కొందరు ఇక పైసలు పెట్టలేమని తప్పించుకొని తిరుగుతున్నారు. ఇప్పటికే చాలామంది జేబులు ఖాళీ అయ్యాయి.

యేడాదిన్నరగా నిలిచిన నిధులు

2024 ఫిబ్రవరి 1న గ్రామ పంచాయతీలు... ఏప్రిల్‌లో మండల, జిల్లా పరిషత్‌లు.. 2025 జనవరి 27న మున్సిపాలిటీల పాలకవర్గం గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే అవకాశం ఉంది. మరింత ఆలస్యమైతే క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుంది. కనీస సౌకర్యాలు కల్పించడం, సిబ్బంది జీతాలు చెల్లింపు భారంగా మారుతుంది. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు అప్పులతో అవస్థల పాలయ్యారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

కీసర, మే10(ఆంధ్రజ్యోతి): కీసరలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. కీసర-కుషాయిగూడ రోడ్డులో గల సూర్య ఫిల్లింగ్ స్టేషన్ వద్ద కొన్ని రోజుల క్రితం మ్యాన్‌హోల్‌పై మూత విరిగిపోయింది. సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానికులు దాని చుట్టూ రాళ్లను పెట్టారు. రాత్రిళ్లు వాహనదారులకు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులు మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



మూతలేని మ్యాన్‌హోల్

దేవరయంజాల్‌లో నూతన అంగన్‌వాడీ కేంద్రం



భవనాన్ని నిర్మించేదుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో శారద, సూపర్‌వైజర్ నాగమణి

శామీర్‌పేట, మే 10(ఆంధ్రజ్యోతి): దేవరయంజాల్‌లో శిథిలమైన అంగన్‌వాడీ కేంద్రం స్థానంలో కొత్త భవనాన్ని మున్సిపల్ అధికారులతో త్వరలోను నిర్మింపజేస్తామని సీడీపీవో శారద తెలిపారు. శనివారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పరిస్థితులను మేడ్చల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శారద, మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి పర్యవేక్షించారు. అంగన్‌వాడీ భవనాల్లో గల సమస్యలను, ఇబ్బందులను తెలుసుకున్నారు. దేవరయంజాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-1 భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించినట్లు, ప్రస్తుతం గ్రామస్తులు కల్పించిన తాత్కాలిక భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతున్నట్లు సీడీపీవో చెప్పారు. నూతన భవన నిర్మాణానికి సీడీపీఓ స్థలాన్ని పరిశీలించారు. తాము మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌కు విజ్ఞప్తిచేయగా మున్సిపల్ నిధులతో భవనాన్ని నిర్మింపజేస్తామని చెప్పారని సీడీపీఓ వివరించారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

యాచారం, మే 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జగన్ కోరారు. శనివారం చింతపట్లలో కూలీల సమస్యలు తెలుసుకున్నారు. వారం వారం విధిగా వేతనాలివ్వాలని అధికారులను కోరారు. పని దినాలను 200కు పెంచాలన్నారు. కూలీలకు బీమా వసతి కల్పించాలన్నారు. పని ప్రదేశంలో తాగు నీటి వసతి, టెంట్‌లు వేయించాలని డిమాండ్ చేశారు. ఫామ్‌పాండ్‌ల నిర్మాణంతో భూగర్భజలం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. ఆయన వెంట సీపీఎం నాయకులు పి.అంజయ్య ఉన్నారు.

నాటకాల నయా ట్రెండ్



ఎన్కేపల్లిలో వినాయకుడి మండపం వద్ద వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)



చిలుకూరులో ఎల్లమ్మ నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)

మొయినాబాద్ రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కేపల్లి, అప్పోజిగూడ, పెద్దమంగళారం, చిలుకూరు, రెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో ఇటీవల జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద వీధి నాటకాల ప్రదర్శన నిర్వహించారు. నేటి సమాజంలో టీవీ, సినిమాలు, సీరియల్స్‌పై మోజు పెరిగినా వీధి నాటకాలకు ఉండే క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. గతంలో కళకారులు రెండు మూడు నెలల పాటు శిక్షణ తీసుకుని మరీ వీధి నాటకాలను ప్రదర్శిస్తున్నారు. గతంలో వీధి నాటకాలు ప్రదర్శించే రోజు గ్రామాల్లో జాతర వాతావరణం నెలకొనేది. గ్రామస్తులు రాత్రి మొత్తం నాటకాన్ని వీక్షించేవారు. సంస్కృతి, సంప్రదాయాలతో పాటు బంధాలు, బంధుత్వాల గురించి బాగా చెప్పేవారని గ్రామాల్లో ముచ్చటించుకుంటున్నారు. గతంలో కొన్ని కుటుంబాల వారు ఈ నాటకాలను ఊరురా తిరుగుతూ ప్రదర్శించి సంతోషంగా జీవితాన్ని కొనసాగించేవారు. టీవీలు, సీరియల్స్, సినిమాలు రావడంతో నాటకాల ప్రభావం పూర్తిగా తగ్గిందని వాపోతున్నారు.

ఆసక్తి చూపుతున్న కళాకారులు

గ్రామాల్లో టీవీలు, సీరియల్స్, సినిమాలు ఒకవైపు చూస్తున్నా వీధి నాటకాలపై కూడా ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రభుత్వం కళాకారులకు సమున్నత స్థాయిని కల్పించి ప్రోత్సహిస్తుండడంతో పాటు నేడు గ్రామాల్లో వీధి నాటకాలకు క్రేజ్ పెరిగింది. పండుగలు వచ్చిన ప్రతిసారి వీధి నాటకాలకు అధిక ప్రాధాన్యం ఇనిస్తున్నారు. ఈ వీధి నాటకాల నిర్వహణ కోసం గ్రామాల్లోని నాయకులు, యువజన సంఘాల సభ్యులు తమ వంతు ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో వీధి నాటకాలు ప్రదర్శించేందుకు కళాకారులు సైతం ఆసక్తి చూపుతున్నారు.

మాకు ప్రోత్సాహం అందించాలి



గ్రామాల్లో తిరిగి వీధి నాటకాలు ప్రదర్శిస్తున్నాం. ప్రజలు విక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పండుగల్లో మాకు ఆదరణ పెరిగింది. ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు విరాళాలు అందిస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ పలు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాం. మమ్మల్ని సాంస్కృతిక శాఖ తరపున గుర్తించి ఉపాధి కల్పించాలి. ప్రోత్సాహం అందిస్తే మా కళను మరింత ప్రదర్శించే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం కళకారులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి

- చదువుల వీరేశ్, కళాకారుడు, రెడ్డిపల్లి

నాటకాలకు ఆదరణ పెరిగింది



గ్రామాల్లో ఇటీవల కాలంలో వీధి నాటకాల ప్రదర్శనకు ఆదరణ పెరిగింది. పాత కాలంలో ఉండే ఈ వీధి నాటకాల ప్రదర్శన మళ్లీ తెరపైకి రావడం అభినందనీయం. ప్రజలు కూడా నూతన పోకడాలకు వెళ్లకుండా గతంలోని ప్రాచుర్య నాటక కళాకారులను ప్రోత్సహించాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరి ప్రతిభకు అవకాశం కల్పించాలి. గతంలో మా గ్రామంలో ఏర్పాటు చేసిన వీధి నాటక ప్రదర్శనకు సహాయం చేశాం.

- గరుగు రాజు, చిలుకూరు

'నేషన్ ఫస్ట్.. పర్సన్ లాస్ట్' బీజేపీ విధానం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

కేశంపేట, మే 10(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ నేషన్ ఫస్ట్ పర్సన్ లాస్ట్ అనే నినాదంతో పాటు దేశ భద్రత, సమగ్రతనే ముఖ్యమనే విధానంతో పనిచేస్తుందని, పదవులు, అధికారం కోసం పాకులాడకుండా దేశ సమైక్యతకు కృషిచేస్తుందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సి.మహేందర్ అన్నారు. కేశంపేటలోని శారద గార్డెన్‌లో బీజేపీ మండలాధ్యక్షురాలు రొల్లు రాధిక నేతృత్వంలో శనివారం బీజేవైఎం నూతన కార్యవర్గ ఎన్నికకు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీకి క్రమశిక్షణ పార్టీగా గుర్తింపు ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ లైన్ దాటి మాట్లాడొద్దని సూచించారు. బీజేపీలో దేశ భద్రతకు మొద టి ప్రాధాన్యం ఉంటుందని, వ్యక్తులకు చివరి ప్రాధాన్యం ఇస్తారని తెలిపారు. గ్రామీణ స్థా యిలో పార్టీని మరితంగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలు కనీసం 100 ఓటర్లను ఎప్పుడు కలుస్తూ ఉండాలని, వారి సమస్యలను పరిష్కారానికి నాయకులు కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలన్నారు. దేశ సమగ్రత, ప్రజల భద్రతే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. బీజేవైఎం కమిటీలో పనిచేసేందుకు ఉత్సహం చూపుతున్న వారి పేర్లను తీసుకున్నారు. త్వరలో కమి టీని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేశ్, మాజీ అధ్యక్షుడు రాఘురాములుగౌడ్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ, బీజేవైఎం మండల అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్, నాయకులు విఠల్‌గౌడ్, నర్సింలు, యుగంధర్, కృష్ణయ్య, నరేందర్‌రెడ్డి, తిరుపతి, రాకేష్, సాయిరామ్, అశోక్, మహేశ్, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, కుమార్, పారేషా, శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రమేష్, సురేష్, పర్వతాలు, ప్రకాశ్‌గౌడ్, రవీంద్ర, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, అధికారులు ➤



మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మే 10(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు శిక్షణ పొందిన 70 మంది మహిళలకు శనివారం ఉచిత కట్టు మిషన్లను, ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఫ్యాషన్ డిజైన్ రంగంలో విరివిగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆ రంగంలో మహిళలు ట్రైనింగ్ పొందాలని సూచించారు. నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, బీసీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకూ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మహిళలనే అధిపతులుగా చేసేందుకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, పరిగి, కులకచర్ల ఏఎంసీ చైర్మన్లు బి.పరశరాంరెడ్డి, ఆంజనేయులు, నాయకులు కె.హన్మంతు, ఇ.కృష్ణ, 'స్ఫూర్తి' సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, మాణిక్యం, సాయప్ప, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

కాంగ్రెస్సోళ్లకే ఇందిరమ్మ ఇళ్లిస్తారా?

● జీవన్గి గ్రామస్తుల ఆగ్రహం ● సర్వేను అడ్డుకునే యత్నం



అధికారులను నిలదీస్తున్న ఎస్సీ కాలనీవాసులు

బషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): పేదోడి సొంతింటి కలను నేరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఇళ్లిస్తారా? అంటూ జీవన్గి ఎస్సీకాలనీ వాసులు శనివారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇంటింటి సర్వేకు వచ్చిన అధికారులను నిలదీస్తూ సర్వేను అడ్డుకునే యత్నం చేశారు. జీవన్గి గ్రామానికి 51ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఈక్రమంలో ఐకేపీ ఏపీఎం పద్మారావు, పంచాయతీ రాజ్ ఏఈ యశ్వంత్, కార్యదర్శి ప్రకాశ్ గ్రామంలో ఇంటింటి సర్వేకు వచ్చారు. సర్వే చేస్తుండగా స్థానిక ఎస్సీ కాలనీ ప్రజలతో పాటు పలువురు అక్కడికి చేరుకుని సర్వే చేస్తున్న అధికారులను ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇళ్లులేని పేదలకు ఇవ్వకుండా కాంగ్రెస్ లీడర్లకు ఇళ్లు ఎలా ఇస్తారంటూ పలువురు మహిళలు అధికారులను చుట్టుముట్టి నిలదీశారు. అధికారులు మాకేం తెలియదని చెప్పగా, గ్రామానికి ఎందుకొచ్చారంటూ పలువురు మండిపడ్డారు. కిరాయి ఇళ్లలో నివాసముంటున్నామని, ఆపార్టీ నేతలు ఇందిరమ్మ ఇళ్లు మాకివ్వకుండా అనర్హులకు ఎలా ఇచ్చారని అధికారుల ఎదుట ఆందోళనకు దిగారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే జోక్యం చేసుకుని అర్హులైన పేదలకు ఇండ్లు దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లిన పలువురు గ్రామస్తులు రెండో శనివారం సెలవు దినం కావడంతో వెనుదిరిగి వచ్చారు. ఇళ్ల విషయంలో అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని గ్రామస్తులు పలువురు హెచ్చరించారు.

నిరుపయోగంగా ఏబీసీసీ

● రూ.43లక్షలతో నిర్మాణం
● మున్సిపాలిటీలో వేలల్లో వీధి కుక్కలు
● తరచూ కుక్కకాటుకు గురవుతున్న స్థానికులు.. చర్యలు శూన్యం

కీసర రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీలో నిర్మించిన జంతు జనన నియంత్రణ కేంద్రం(యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీసీ) నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని రూ.43లక్షలతో నిర్మించగా ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. పట్టణ ప్రజలు తరచూ వీధి కుక్కల దాడులకు గురవుతుండటంతో మున్సిపల్ పరిధిలో నూతనంగా జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని నిర్మించేందుకు నాటి పాలకవర్గ ఆమోదం తెలిపింది. ఆమేరకు రూ.43లక్షలతో నిర్మాణ పనులు చేపట్టింది. జిల్లా అధికారులూ పలుమార్లు తనిఖీలు నిర్వహించారు. భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఆగమేఘాల మీద నిర్మాణ పనులు పూర్తిచేశారు. వీధి కుక్కలకు ఇక్కడ చికిత్సలు చేయించి, వారం రోజుల పాటు వాటిని సంరక్షించి వీధుల్లో వదిలే విధంగా ప్రణాళిక రచించారు. అయితే 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా ఏబీసీ సెంటర్ పనులు పూర్తయి రెండేళ్లయినా అక్కడ కుక్కలకు చికిత్సలు చేయడంలేదు. అదనంగా రూ.5లక్షలు వెచ్చిస్తే ఏబీసీ సెంటర్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కమిషనర్లు మారుతున్నారే తప్పా ఇక్కడి పనుల్లో పురోగతి కనిపించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రాంపల్లిలోని జంతు జనన నియంత్రణ కేంద్రం



కుక్కల ఐసోలేషన్‌కు ఏర్పాటు చేసిన కేజ్‌లు


మున్సిపాలిటీ పరిధిలో 3వేల వీధి కుక్కలు

నాగారం మున్సిపల్ పరిధిలో దాదాపు మూడు వేల వీధి కుక్కలు ఉన్నట్లు అధికారులు గతంలో అంచనావేశారు. సమీప గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావటంతో వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వీటి నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేసేందుకు మున్సిపల్ అధికారులు ఓ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం ఒక్కో కుక్కకు రూ.1650 చొప్పున నెలకు 100 కుక్కలకు శస్త్ర చికిత్స చేయాల్సివుంది. ఇలా చేస్తే వీధి కుక్కల నియంత్రణకు మూడేళ్ల కాలం పట్టే అవకాశం ఉంది. నెలకు దాదాపు 300కుక్కలకు శస్త్ర చికిత్స చేసే అవకాశం ఉంటుంది.

తరచూ కుక్కకాటు ఘటనలు

మున్సిపాలిటీ పరిధిలో వేలాది వీధికుక్కలు ఉండటంతో జనాలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కల బెడద నుండి ప్రజలకు రక్షణ కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఏబీసీ భవనాన్ని అందుబాటులోకి ఎందుకు తీసుకురావడం లేదని పురపాలక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం



జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. శస్త్ర చికిత్సకు సంబంధించిన పరికరాలతో పాటు ఏసీ సౌకర్యం కల్పించాల్సి ఉంది. అందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఈ నెలాఖరులోగా శస్త్రచికిత్సలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

- భాస్కర్‌రెడ్డి, నాగారం మున్సిపల్ కమిషనర్

క్రైం కార్నర్

సీసీఐ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



మృతుడు హుస్సేన్‌అలీ



ఆందోళనలో సీఐటీయూ నాయకులు, తోటి కార్మికులు

తాండూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్ సీసీఐ కర్మాగారంలో పంప్ హౌస్‌లో పనిచేస్తున్న ఓ కాంట్రాక్ట్ కార్మికుడు పంప్ ఆపరేటర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబీకులు సీసీఐ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు సీసీఐ కర్మాగారం గేటు ఎదుట నాలుగు గంటల పాటు ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సేడం తాలూకా కుక్కింద గ్రామానికి చెందిన హుస్సేన్ అలీ(39), కాశీంఅలీ, ఇద్దరూ అన్నదమ్ములు. గత 15ఏళ్ల కిందట కాశీం అలీ పేయింటర్‌గా పనిచేస్తుండగా, హుస్సేన్ అలీ సీసీఐ కర్మాగారంలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా కర్మాగారంలోని వాటర్ పంప్ హౌస్‌లో విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా కింద పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు ఆయన సోదరుడు కాశీం అలీకి సమాచారం అందించి చికిత్స నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న సీసీఐ కాంట్రాక్ట్ యూనియన్ జనరల్ సెక్రెటరీ శరణప్ప, ఏఐటీయూసీ నాయకులు కార్మికులతో కలిసి సీసీఐ మెయిన్ గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి రూ.20లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీసీఐయాజమాన్యం సమాచారం మేరకు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సీసీఐ కర్మాగారం చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. అయినప్పటికీ యాజమాన్యం పట్టించుకోవడంతో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాజ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు హేమంత్‌కుమార్‌లు సీసీఐ కర్మాగారం దగ్గరికివెళ్లి యాజమాన్యంతో చర్చించారు. మృతుడి కుటుంబంలో ఒకరికి కర్మాగారంలో కాంట్రాక్ట్ ఉద్యోగంతోపాటు రూ.25వేల అంత్యక్రియల ఖర్చులు, మరో రూ.50వేలు ఎస్పే కాంట్రాక్టర్ వద్ద నుంచి ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులకు చట్టపరంగా వచ్చేఎంప్లాయీస్ డెత్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబీకులు, కార్మికులు అంగీకరించి ఆందోళన విరమించారు. మృతుడి అన్న కాశీంఅలీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపారు.

మహిళపై హత్యాయత్నం.. యువకుడి రిమాండ్



నిందితుడు తుంగర్ పవన్ కళ్యాణ్

ఘట్‌కేసర్ రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడ రాజీవ్‌గృహకల్పకు చెందిన ఆటోడ్రైవర్ తుంగర్ పవన్‌కళ్యాణ్(24) బైక్‌లో శుక్రవారం మధ్యాహ్నం పెట్రోల్ అయిపోయింది. దీంతో అతడు తన బైక్‌ను ఎన్టీపీసీ చౌరస్తాలో నిలిపి పెట్రోల్ తెచ్చుకోవడానికి వెళ్లాడు. పవన్‌కళ్యాణ్ పెట్రోల్ తీసుకొని బైక్‌పార్కు చేసిన విషయాన్ని మరిచిపోయి, ఎన్టీపీసీ చౌరస్తా, సాయినగర్ వద్ద టిఫిన్‌సెంటర్ నడిపిస్తున్న జింకల నవత(37) వద్దకు వచ్చి నా ఇక్కడే బైక్ పార్కు చేశాను కనిపించడం లేదు. నువ్వే బైక్‌ను తీశావని ఆమెతో వాగ్వివాదానికి దిగాడు. బైక్ ఇక్కడ పార్కు చేయలేదని ఎంత చెప్పినా వినకుండా కోపంతో రగిలిపోయాడు. అంతటితో ఆగకుండా నవతపై పెట్రోల్‌పోసి నిప్పంటిచడానికి యత్నించాడు. గమనించిన స్థానికులు అతడిని నివారించి పోలీసులకు సమాచారం అందించగా పవన్‌కళ్యాణ్ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని శనివారం ఉదయం అరెస్టు చేసి రాత్రికి రిమాండ్ తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపాడు.

అంతా మా ఇష్టం!

(ఐదో పేజీ తరువాయి)

అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారు గ్రామాలకు నెలకొక్కసారి కూడా రావడం గగనమైంది. దీనిని అదనుగా భావించిన పంచాయతీ కార్యదర్శులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు.

అధికారులు.. నేతల ఒప్పందాలు

అధికారులు, నేతలు ఒక్కటై ప్రజలను దోచుకుంటున్నారు. మూడుచింతలపల్లి ఇటీవల మున్సిపాలిటీగా మారడంతో గ్రామకంఠం భూములు, ఇంటి నంబర్లు, ఇంటి పన్ను చెల్లించాలంటే ఇప్పుడే అవకాశం ఉందని తర్వాత కుదరదని నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారుల వద్దకు పంపిస్తున్నారు. ఈ అవకాశాన్ని అధికారులు అందిపుచ్చుకొని ప్రజలు తమ వద్దకు రాగానే ఒక రేటు ఫిక్స్ చేసి డబ్బులు తీసుకుంటున్నారు. తీసుకున్న దాంట్లో సగం తిరిగి నేతలకు ఇచ్చిలావాదేవీలు జరుపుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇంత జరుగుతున్నా ఎంపీవోకు తెలియదా?

మూడుచింతలపల్లి మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో అధికారులు కాసుల కోసం పక్కదారి పడుతుంటే, మండల అధికారులకు తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక్కప్పుడు గ్రామాలకు సరిగా రాని పంచాయతీ కార్యదర్శులు ఇప్పుడు కాసుల కోసమే వస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. చివరకు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా డబ్బులు ముట్టజెప్పాల్సిందే అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా స్థాయి అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయం

ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాను



పంచాయతీ కార్యదర్శులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాను. గ్రామాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని నా దృష్టికి రాలేదు. విచారణ జరిపి తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- మంగతాయారు, ఎంపీవో, మూడుచింతలపల్లి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవాబుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఆర్కతల చౌరస్తాలో శనివారంవాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు లైసెన్స్, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ప్రయాణించాలన్నారు. నెంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బీజేపీలోకి చీర్యాల్ మాజీ సర్పంచ్



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న అశోక్‌యాదవ్

కీసర, మే 10 (ఆంధ్రజ్యోతి): చీర్యాల్ మాజీ సర్పంచ్ కోల అశోక్ యాదవ్ బీజేపీలో చేరారు. ఈమేరకు శనివారం మాల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ నివాసానికి తరలివెళ్లగా, ఈటల రాజేందర్ కోల అశోక్ యాదవ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోని స్వాగతం పలికారు.

అలియాబాద్ సెంట్రల్ బ్యాంక్ మేనేజర్‌గా మాధురి



మాధురికి పుష్పగుచ్చం అందజేస్తున్న గ్రామ నాయకులు

శామీర్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) అలియాబాద్ బ్రాంచ్ నూతన మేనేజర్‌గా మాధురి ఇటీవల ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు శనివారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, శ్రావణ్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, వెంకటేశ్, జగదీశ్‌గౌడ్, అశోక్‌లు అభినందిస్తు ఘనంగా సన్మానించారు. అనంతరం మాధురి మాట్లాడుతూ యువ వికాసం, క్రాప్, పర్సనల్, హౌసింగ్ లోన్లు తదితర లోన్లు అర్హులకు సకాలంలో అందేలా చూస్తామని తెలిపారు.

మోత్కూర్‌లో భగవద్గీత పోటీలు



మోత్కూర్‌లో భగవద్గీత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దోమ, మే 10 (ఆంధ్రజ్యోతి): మోత్కూర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించారు. 15మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త శివకుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటయ్య, శిక్షకుడు రాములు, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ మల్లేశం, గోపాల్ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలికి సన్మానం



జానకిని సన్మానిస్తున్న లకరుణఅజయ్‌ప్రసాద్

బషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన జానకిని బషీరాబాద్ మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ శనివారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రియాజ్, నరేష్, మైనార్టీ నాయకుడు సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేసారంలో పవిత్ర యాగం

మోమిన్‌పేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసారంలో వేద రహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత్-పాక్ యుద్ధంలో భారతసైన్యం విజయం సాధించే వరకు ఆదివారం(నేడు) పవిత్ర యాగం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మన్యురీంద్రశర్మ తెలిపారు. ఈ యాగం ద్వారా భారత సైనికులు, నౌకదళం, వైమానిక దళం, దేశ రక్షణ కోసం కృషిచేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ప్రతీ ఒక్కరి భద్రతకు ఐకమత్యంతో మద్దతు తెలపాలన్నారు.

బాబోయ్ దొంగలు!

● వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న వాహన యజమానులు
● వాహనాల బ్యాటరీల చోరీ
● మూడు నెలల కిందట పెద్దఎత్తున బాటరీలు అపహరణ

కీసర, మే 10 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లు, పెద్ద, పెద్ద లారీలు, టిప్పర్లు, జేసీబీల బ్యాటరీలే వారి టార్గెట్. అదను చూసి, రాత్రికిరాత్రే గుర్తుతెలియని దుండగులు పార్కింగ్ చేసి ఉన్న వాహనాల బ్యాటరీలను ఎత్తుకెళ్లిపోతున్నారు. గతంలో దాదాపు 40బ్యాటరీలు ఎత్తుకెళ్లారంటే ఏస్థాయిలో చోరీలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వివరాల్లోకి వెళ్తే.. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని లారీ, ట్రాక్టర్, జేసీబీల యాజమానులు ఇళ్ల ముందు వాహనాలు పార్కింగ్ చెద్దామంటే జంకుతున్నారు. అంత పెద్ద వాహనాలను ఇళ్లలో పార్కింగ్ చేయలేక ఇళ ముందు, పకక్కన ఖాళీ స్థలాల్లో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాలకు ఉన్న బ్యాటరీలను లక్ష్యంగా చేసుకొని ఓముఠా వాటిని ఎత్తుకెళ్తున్నారు. శుక్రవారం రాత్రి కీసరలో ట్రాక్టర్, లారీలకు సంబంధించిన బ్యాటరీలు, భోగారంలో జేసీబీల బ్యాటరీలు బైక్‌లపై వచ్చిన గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే మూడు నెలల కిందట కూడా కీసర, భోగారంలోని పెద్ద, పెద్ద వాహనాలను లక్ష్యంగా చేసుకొని దొంగల ముఠా పెద్దఎత్తున దాదాపు 40 బ్యాటరీలు ఎత్తికెళ్లిన్నట్లు బాధితులు వాపోతున్నారు. ట్రాక్టర్‌కు సంబంధించిన బ్యాటరీలు రూ.6వేలు, లారీలకు, జేసీబీలకు సంబంధించిన బ్యాటరీలు రూ.10వేలకు పైనే ధర పలుకుతుందని వాహన యజమానులు తెలిపారు. గతంలో జరిగిన చోరీకి సంబంధించి ఎలాంటి పురోగతి లేకపోవడంతో బాధితులు అధికారుల తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పోలీసులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఇప్పటికైనా రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని కోరుతున్నారు.



ట్రాక్టర్ బ్యాటరీని ఎత్తుకెళ్లిన దుండగులు

చర్యలు తీసుకుంటాం

ఇటీవలే బదిలీపై కీసర పోలీస్‌స్టేషన్‌కు వచ్చాను. శుక్రవారం జరిగిన దొంగతనాలపై క్రైం విభాగం అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా రాత్రిళ్లు గస్తీ పెంచి దొంగతనాల నియంత్రించేందుకు కృషిచేస్తాం. ప్రజలు కూడా దొంగల బారి నుంచి అప్రమత్తంగా ఉండాలి. గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- శ్రీనివాస్, సీఐ, కీసర పోలీస్‌స్టేషన్

బీటీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ప్రణీత్

ధారూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): కుక్కింద క్రాస్‌రోడ్డు నుంచి వయా గడ్డమీది గంగారం మీదుగా కోట్‌పల్లి ప్రాజెక్టు క్రాస్ రోడ్డు వరకు నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను శనివారం పంచాయతీ రాజ్ ఏఈ ప్రణీత్ తనిఖీ చేశారు. కుక్కింద క్రాస్ రోడ్డు నుంచి కోట్‌పల్లి ప్రాజెక్టు వరకు ఐదు కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి రూ.2.82కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన రెండున్నర బీటీరోడ్డు నిర్మాణ పనుల కొలతలు తీసి పొడువు, వెడల్పు, లోతును లెక్కించి నాణ్యతను తనిఖీ చేశారు. అసంపూర్తిగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తామని పీఆర్ డీఈ శ్రీనివాస్ తెలిపారు.

గొల్లకురుమలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కీసర, మే 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మేడ్చల్ జిల్లా గొల్ల కురుమల సంఘం ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య అన్నారు. కీసర మల్లన్న దేవాలయం వద్ద మేడ్చల్ జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల మహాసభ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎక్కలదేవి కొమరయ్య విచ్చేసి మాట్లాడుతూ అధికారంలోని వచ్చిన మూడు నెలలోనే లక్షల నగదు ద్వారా గొర్రెల పంపిణీ చేస్తామని సంవత్సరాలు గడుస్తున్న దాని ఊసే లేదన్నారు. పశువుల ఆస్పత్రిలో సరైన మందులు అందుబాటులో లేవన్నారు. కనీసం నట్టల మందులు కూడా ఇవ్వడం లేదని, జిల్లా వ్యాప్తంగా కుక్కల దాడిలో వందల గొర్రెలు, మేకలు మృత్యువాతపడుతున్నాయని తెలిపారు. అదేవిధంగా జీవాలు అపహరణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పశు సంవర్ధన శాఖమంత్రికి విన్నవించుకుందామంటే అట్టి శాఖ సీఎం వద్దే ఉండగా ఆయనను కలిసేందుకు అధికారులు అవకాశం ఇవ్వడం లేదని కొమురయ్య అన్నారు. గొల్ల కురుముల సమస్యలను, డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నేరవేర్చాలని ఆయన అన్నారు.



నూతన సభ్యులను సన్మానిస్తున్న కొమురయ్య

రూ.20లక్షలతో సీసీ రోడ్డు



కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు

పూడూరు, మే 10, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకంచర్ల లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ ఆవరణలో రూ.20లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీరోడ్డు పనులు జరుగుతున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ పెంటయ్య తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా..

నేటి నుంచి రాకంచర్ల తిరుమలనాథస్వామి జాతర

పూడూరు: మండల పరిధిలోని రాకంచర్ల లక్ష్మీనర్సింహస్వామి, తిరుమలనాథస్వామి జాతర మహోత్సవాలు నేటి (ఆదివారం)నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ పెంటయ్య, మాజీ ఉప సర్పంచ్ కమ్లీబాయి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్: పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేడు (ఆదివారం) నుంచి ఈనెల 15వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ చింతపంటి సత్తయ్యయాదవ్ తెలిపారు. ఆదివారం ఉదయం సభాప్రార్థన, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య, ప్రాసన, దీక్షాధారణ, దీక్ష సంకల్పం, రక్షాబంధన, అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం. బలిహరణం, మంత్రపుష్పం, సోమవారం సుప్రభాత సేవ, నిత్యహోమం, బలిహరణం, 10.30లకు స్వామివారి కల్యాణం, సాయంత్రం హనుమంతసేవ, మంగళవారం సుప్రభాతసేవ, నిత్యహోమం, బలిహరణం, గరుడ సేవ, బుధవారం రథోత్సవం, శేషవాహన సేవ, గురువారం చక్రతీర్థం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఉంటాయని తెలిపారు.

కొనసాగుతున్న పూడికతీత పనులు

కులకచర్ల: బండవెల్కిచర్ల పాంబండపై గల సిద్ది రామప్ప జీవసమాధి ముందు గల గుండంలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గుండంలో నీరు ఊటికి వస్తోంది. ఈ పనులను శనివారం మట్టి ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి పరిశీలించారు. వేసవిలో నీరు రావడం అంతా శ్రీ రామలింగేశ్వరస్వామి మహిమే అన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల: రాంపూర్‌లో శనివారం చెంచు రాములు(50) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్ రెడ్డి ఆయన అనుచరుల ద్వారా రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసుమ సముద్రం, కులకచర్ల గ్రామాల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కులకచర్లలో బైరం నవీన్‌కు రూ.60వేలు, కుసుమ సముద్రంలో పానగారి అంజిలమ్మకు రూ.30వేలు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, వెంకటేశ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరిపై హర్షం

ధారూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.90కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయమని మాజీ వైస్‌ఎంపీపీ వి.మల్లికార్జున్, ఆయకట్టు రైతులు తెలిపారు. శాసన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.